జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 44 24-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06




## ఝార్ఖండ్ లో కుప్పకూలిన ఎయిర్ అంబులెన్స్

- ఝార్ఖండ్‌లో కుప్పకూలిన రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్ విమానం
- రాంచీ నుంచి ఢిల్లీ వెళ్తుండగా చత్రా జిల్లాలో ఘటన
- విమానంలో పైలట్లు, రోగి సహా ఏడుగురు ప్రయాణికులు
- ప్రమాదంలో ఏడుగురూ మృతి చెందినట్లు అధికారులు వెల్లడి

మిగతా 2లో



## తన పేరుతో సంస్థల ఏర్పాటుపై స్పందించిన కేటీఆర్

- కేటీఆర్ సేవా సమితి, కేటీఆర్ సేవ పేరుతో కార్యకలాపాలు
- తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని స్పష్టీకరణ



## తిరుమలరుమల లడ్డూ వివాదం..

- ఏపీ ప్రభుత్వానికి సుప్రీంలో భారీ ఊరట
- ఏకసభ్య కమిషన్ ఏర్పాటును సవాలు చేసిన సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్ కొట్టివేత
- కమిటీ విచారణ కొనసాగించవచ్చని స్పష్టం చేసిన సుప్రీం ధర్మాసనం
- సిట్, కమిటీ దర్యాప్తులు వేర్వేరని, ఒకదానిపై ఒకటి ప్రభావం చూపవని వెల్లడి
- రిటైర్డ్ ఐఏఎస్ దినేశ్‌కుమార్ కమిటీ నివేదికకు మార్గం సుగమం

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకం ఆరోపణలకు సంబంధించిన వివాదంలో ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో పెద్ద ఊరట లభించింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ విచారణను కొనసాగించవచ్చని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కమిషన్ నియామకాన్ని సవాలు చేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఇవాళ కీలక తీర్పు వెలువరించింది.

2లో

# తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు..

### మెట్రో స్వాధీనం.. వైద్య రంగంలో భారీ మార్పులు!



- ప్రతి జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ ఆఫీసుకు భూ కేటాయింపు
- తెలంగాణ వైద్య విధాన పరిషత్ పేరు మార్పు
- ఇకపై ప్రభుత్వ పరిధిలోకి టీవీవీపీ ఉద్యోగులు
- ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా & టర్మ్ ఇన్సూరెన్స్ భరోసా
- క్యాష్‌లెస్ ఎంప్లాయీ హెల్త్ స్కీమ్‌కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- హైదరాబాద్ మెట్రో స్వాధీనం.. ఫేజ్ 2 విస్తరణకు వేగం
- హెచ్ఎండిఏ విస్తరణ, రోడ్లు-నీటి ప్రాజెక్టులకు భారీ ఆమోదాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో రాష్ట్ర పురోగతికి సంబంధించి పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ మెట్రో రైలు వ్యవహారం, వైద్య విధాన పరిషత్‌లో మార్పులు , భూ కేటాయింపులపై కేబినెట్ ముద్ర వేసింది. ఈ కేబినెట్ సమావేశంలో తీసుకున్న అత్యంత కీలక నిర్ణయం హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించింది. ప్రస్తుతం ఎల్ అండ్ టీ (ఎల్&టీ) సంస్థ నిర్వహణలో ఉన్న మెట్రోను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. ప్రజారవాణాను మరింత బలోపేతం చేసే దిశగా, ప్రైవేట్ భాగస్వామ్యం నుంచి మెట్రోను ప్రభుత్వ పరిధిలోకి తీసుకురావాలని కేబినెట్ నిర్ణయించింది.

## డీజీపీ గారూ... అవి ఫేక్ న్యూస్ క్లిప్పింగ్స్: హరీశ్ రావు

- సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా ఫేక్ న్యూస్ క్లిప్పుల ప్రచారం
- ఇది పోలీసు వ్యవస్థ విశ్వసనీయతపై జరుగుతున్న దాడి అని హరీశ్ రావు ఆరోపణ
- ఫేక్ న్యూస్ వెనుక ఉన్నవారికి సీఎం అండదండలు ఉన్నాయా అని ప్రశ్న
- దుష్ప్రచారం చేస్తున్న వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



2లో



## డిగ్రీ కాలేజీ భూముల వ్యవహారం..

- షబ్బీర్ అలీకి వెంకటరమణారెడ్డి ఛాలెంజ్
- ఒక్క గజం భూమిని ఆక్రమించినట్టు నిరూపించినా పదవి వదులుకుంటానన్న వెంకటరమణారెడ్డి
- అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ మండిపాటు
- పోలీసుల తీరును కూడా తప్పుపట్టిన వైనం

## ప్రభుత్వ వైఫల్యమే కారణం..

- కల్తీ పాల ఘటనపై జగన్ ఫైర్
- రాజమండ్రిలో కల్తీ పాలతో నలుగురి మృతి!
- ఈ ఘటనపై మాజీ సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి
- ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- ఒకే పాల వ్యాపారి నుంచి పాలు కొన్న బాధితులు



2లో

# ఈసారి సేవ చేసే అవకాశం బీజేపీకి ఇవ్వండి..

### బెంగాలీయులకు మోడీ పిలుపు

### ప్రస్తుత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

ఈసారి బీజేపీ ప్రభుత్వానికి సేవ చేసే అవకాశం ఇవ్వాలని పశ్చిమ బెంగాల్ ప్రజలను ప్రధాని మోడీ కోరారు. ఈ మేరకు బెంగాలీయులను ఉద్దేశించి బహిరంగ లేఖ విడుదల చేశారు. రాష్ట్ర అభివృద్ధి, శాంతి భద్రతలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావిస్తూ హిందీ, బెంగాల్ భాషల్లో లేఖలు రాశారు. లేఖ ప్రారంభంలో కాళీమాతను స్తుతిస్తూ రాశారు. త్వరలోనే బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూల్ విడుదలకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఈ తరుణంలో ప్రధాని మోడీ లేఖ రాయడం కీలకంగా మారింది. రాబోయే నెలల్లో రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించే అధికారం ప్రజలదేనని లేఖలో పేర్కొన్నారు. అభివృద్ధి, సంపన్నమైన రాష్ట్రంగా మార్చేందుకు ఇదొక అవకాశం అని.. ఈ అభివృద్ధి ప్రయాణంలో బెంగాలీయులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



2లో

# తన పేరుతో సంస్థల ఏర్పాటుపై స్పందించిన కేటీఆర్

తన పేరుతో కొంతమంది సంస్థలను ఏర్పాటు చేసినట్లు వచ్చిన వార్తలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తెలంగాణలో 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' పేరుతో కొన్ని సంస్థలు కార్యకలాపాలు చేపడుతుండటంపై ఆయన స్పందించారు. తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని వెల్లడించారు. అలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు. తన పేరుతో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు ఎలాంటి గుర్తింపు, అనుమతి లేదనే విషయం అందరూ గుర్తించాలని అన్నారు. ఎవరైనా పనిచేయాలనుకుంటే కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ పరిధిలోనే చేయాలని కేటీఆర్ స్పష్టం చేశారు. తన పేరుతో పలు సంస్థల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను నిలిపివేయాలని, తనపై అభిమానం ఉన్నవాళ్లు బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేయాలని సూచించారు.

## ఈసారి సేవ చేసే అవకాశం బీజేపీకి ఇవ్వండి

బెంగాల్ భూమి దేశానికి అనేక మంది గొప్ప వ్యక్తులను అందించిందని.. నేతాజీ సుభాష్ చంద్రబోస్, రవీంద్రనాథ్ ఠాగూర్‌లను ఉదహరించారు. బెంగాల్‌కు కీర్తిని తెచ్చిన గొప్ప వ్యక్తులను, దానికి కొత్త దిశానిర్దేశం చేయవలసిన అవసరాన్ని తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దార్శనికతను కూడా గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోయినా.. అనేక కేంద్ర పథకాల ప్రయోజనాలు పశ్చిమ బెంగాల్‌లోని లక్షలాది మందికి చేరాయని పేర్కొన్నారు. రైతులు, యువత, మహిళలు, పేదల కోసం ప్రారంభించిన పథకాలు సానుకూల ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. గత 11 సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చిందని మోడీ గుర్తుచేశారు. ఇటీవల కాలంలో రాష్ట్రం వెనుకబడి ఉందని లేఖలో రాశారు. రాజకీయ హింస, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు రాష్ట్ర పురోగతికి ఆటంకం కలిగిస్తున్నాయని ఆరోపించారు. యువత వలసలు, పెట్టుబడుల కొరత గురించి కూడా ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలంటే బీజేపీకి అవకాశం ఇవ్వాలని మోడీ కోరారు.

# తిరుమలరుమల లడ్డూ వివాదం..

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. తిరుమల నెయ్యి వ్యవహారంపై ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ సిట్ దర్యాప్తు చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం సమాంతరంగా మరో కమిటీని ఎలా ఏర్పాటు చేస్తుందని సుబ్రహ్మణ్యస్వామి తన పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సీఎం చంద్రబాబు, టీటీడీ, సీబీఐని ప్రతివాదులుగా చేర్చారు. స్వామి వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం.. ఒక దర్యాప్తు సంస్థ విచారణ మరో కమిటీపై ప్రభావం చూపదని స్పష్టం చేసింది. "రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిటీ పరిపాలనాపరమైన లోపాలను గుర్తించేందుకు ఏర్పాటు చేయబడింది. ఇది సీబీఐ దర్యాప్తును ప్రభావితం చేస్తుందని మేము భావించడం లేదు. చట్ట ప్రకారం సిట్, ఏకసభ్య కమిటీ తమ తమ విధులను నిర్వర్తించవచ్చు" అని ధర్మాసనం పేర్కొంది. ఈ రెండు విచారణలు వేర్వేరని, ఒకదాని పరిధిలోకి మరొకటి రాదని (ఓవర్‌లాపింగ్ కాదని) తేల్చి చెప్పింది. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం నెయ్యి కొనుగోలు టెండర్లు, నిబంధనల సడలింపులో లోపాలు జరిగాయని సీబీఐ సిట్ తన నివేదికలో ప్రభుత్వానికి వెల్లడించింది. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది. ఈ సిట్ నివేదిక ఆధారంగా ఎవరిపై, ఎలాంటి చర్యలు తీసుకోవాలో సిఫార్సు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 45 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఈ కమిటీని ఆదేశించింది. తాజాగా సుప్రీంకోర్టు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో దినేశ్‌కుమార్ కమిటీ తన విచారణను ముందుకు తీసుకెళ్లేందుకు మార్గం సుగమమైంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.

# పొందూరు ఖాదీతో నారా లోకేశ్ కు శ్రీకాకుళం నేతల సరదా కౌంటర్

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన ఆత్మీయ విందు, రాజకీయాలకు అతీతంగా నవ్వుల విందుగా మారింది. శ్రీకాకుళం, విజయనగరం పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యుల కోసం సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో లోకేశ్ ఈ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రోజూవారీ రాజకీయ హడావుడికి దూరంగా, పూర్తి వ్యక్తిగత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం అందరిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సమావేశంలో నేతలంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, తమ కుటుంబసభ్యులను పరస్పరం పరిచయం చేసుకున్నారు. రాజకీయ అంశాలకు తావులేకుండా ప్రేమలు, పెళ్లిళ్లు, పిల్లల బాగోగులు, ప్రాంతీయ ప్రత్యేకతల వంటి ఆసక్తికరమైన విషయాలపై ముచ్చటించుకున్నారు. శ్రీకాకుళం నేతల వెటకారం, విజయనగరం నాయకుల చతురతతో సంభాషణలు రక్తి కట్టించాయి.



# తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు..

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని వైద్య రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 'తెలంగాణ వైద్య విధాన పరిషత్' (ుఎవూ) పేరును ఇకపై లిలి'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'లిలిగా మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో పాటు, ఇప్పటివరకు పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని నిర్ణయించారు. దీనివల్ల వేలమంది వైద్య సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. రాజకీయ పార్టీల బలోపేతానికి సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరికొన్ని కీలక భూ కేటాయింపులపై కూడా కేబినెట్ స్పష్టతనిచ్చింది. ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణం లేదా ఇతర ఆధ్యాత్మిక సేవల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించారు. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరులో కొత్తగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణానికి గాను 70 ఎకరాల భారీ కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం , రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం తీసుకున్న ఈ నిర్ణయాలు తక్షణమే అమలులోకి రానున్నాయి.

**తెలంగాణలో మెగా నిర్ణయాలు.. ఎవరికెంత లాభం.?**

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలతో మరోసారి సంచలనం సృష్టించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం నుంచి హైదరాబాద్ మెట్రో స్వాధీనం వరకు పలు ప్రధాన అంశాలపై కీలక ఆమోదాలు లభించాయి. ప్రమాద బీమా, క్యాష్‌లెస్ హెల్త్ స్కీమ్, హెచ్ఎండిఏ విస్తరణ, రోడ్లునీటి ప్రాజెక్టులు వంటి నిర్ణయాలతో రాష్ట్ర పరిపాలనలో కొత్త దిశ కనిపిస్తోంది.

1. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం.. భద్రతకు రాష్ట్ర మంత్రి వర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశంలోనే ఆదర్శవంతమైన కొత్త పథకాలు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు జరిగిన మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తి భద్రత, భరోసా కల్పించేందుకు రెండు కొత్త పథకాలను ప్రారంభిస్తుంది.

**మొదటిది.. ఉద్యోగుల ప్రమాద బీమా పథకం**

- దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు అందరికి, పెన్షనర్లకు ప్రమాద బీమా పథకం అమలు చేస్తుంది.
- ఉద్యోగులు ఒక్క రూపాయి ప్రీమియం కూడా చెల్లించకుండా ఈ పథకాన్ని అమలు చేస్తుంది.
- మన ప్రభుత్వం తొలిసారిగా సింగరేణిలో, ట్రాన్స్ కోలో ఉద్యోగ వర్గాలకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అక్కడ విజయవంతంగా అమలు చేసింది.
- ఇప్పుడు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు అందరికి ఈ పథకాన్ని ప్రారంభిస్తుంది.
- ఈ ప్రమాద బీమా అమలుతో ఒకవేళ ఎవరైనా ప్రమాదం లో మరణిస్తే రూ.1.2 కోట్లు ప్రమాద బీమా పరిహారం అందుతుంది.
- సహజ మరణానికి 60 ఏళ్ల వరకు ఉద్యోగులకు రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ వర్తిస్తుంది.
- రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వ కార్పొరేషన్లు. ప్రభుత్వ రంగ సంస్థల పరిధిలో 5 లక్షల 19 వేల మంది రెగ్యులర్ ఉద్యోగులున్నారు. వీరితో పాటు 2 లక్షల 38 వేల మంది పెన్షనర్లు ఉన్నారు. మొత్తం 7.57 లక్షల మందికి ఈ ప్రమాద బీమా వర్తిస్తుంది.

**2. ఉద్యోగులకు రెండో శుభవార్త.. క్యాష్ లెస్ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్**

- దీర్ఘకాలికంగా ప్రభుత్వ ఉద్యోగుల ఎదురుచూస్తున్న మరో కోరికను రాష్ట్ర కేబినెట్ ఈ రోజు నెరవేర్చింది.
- ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు క్యాష్ లెస్ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్ (జుఎూ) అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది.
- 3 లక్షల 56 వేల మంది ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులతో పాటు 2.88 లక్షల మంది పెన్షనర్లు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు మొత్తం 17.07 లక్షల మందికి ఈ పథకం వర్తిస్తుంది.
- ఇకపై ప్రభుత్వ ఉద్యోగులు ఆసుపత్రుల్లో ఒక్క రూపాయి చెల్లించకుండానే వైద్య చికిత్సలు అందుతాయి.
- అన్ని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు 652 ఎంప్యానెల్ ప్రైవేట్ హాస్పిటల్స్ లో ఈ పథకం వర్తిస్తుంది. దీనిపై మొత్తం 1998 వైద్య చికిత్సలు అందిస్తారు.
- ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ ఎంప్లాయీ కార్డ్ అందిస్తారు.
- రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు ఈ ఉచిత నాణ్యమైన వైద్యం అందించాలని కేబినెట్ నిర్ణయించింది.
- ఈ పథకానికి ప్రభుత్వ ఉద్యోగులు తమ బేసిక్ పే నుంచి 1.5 శాతం తమ వాటాగా చెల్లిస్తారు. అంతే సమాన వాటాను ప్రభుత్వం మ్యాచింగ్ వాటా చెల్లిస్తుంది.

# ప్రభుత్వ వైఫల్యమే కారణం..



రాజమండ్రిలో కల్తీ పాలు సేవించి నలుగురు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ సంఘటనపై మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపిన ఆయన, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆహార భద్రత అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లిందని జగన్ ఆరోపించారు. ఈ దారుణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి విషాదాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో ఇవి పునరావృతం కాకుండా తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు. బాధితులందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్య శాఖ వెంటనే రంగంలోకి దిగాలని, అవసరమైతే నిపుణులైన వైద్య బృందాలను పంపాలని జగన్ కోరారు. ఆహార భద్రత తనిఖీలను కట్టుదిట్టం చేసి, పాల వంటి నిత్యావసరాలపై ప్రజలకు నమ్మకం కలిగించాలని విజ్ఞప్తి చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి నగరంలోని లాలా చెరువు, చౌడేశ్వరి నగర్ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా నలుగురు మరణించారు. మూత్రం రాకపోవడం (అనూరియా) లక్షణాలతో వీరు మృతి చెందగా, దీనికి కల్తీ పాలే కారణమని అనుమానిస్తున్నారు. ఆదివారం రాత్రి ఎస్. శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) మరణించారు. అంతకుముందు మరో ఇద్దరు చనిపోయారు. ఈ నెల 15 నుంచి సుమారు 14 మంది అనారోగ్యంతో వివిధ ఆసుపత్రుల్లో చేరారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నారు. బాధితులంతా ఒకే పాల వ్యాపారి వద్ద పాలు కొనుగోలు చేయడంతో కల్తీ జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

# కొయ్యలగూడెం మండలంలో రవాణా సమస్యకు పవన్ పరిష్కారం

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో ఏలూరు జిల్లా, కొయ్యలగూడెం మండలంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రవాణా సమస్యకు పరిష్కారం లభించింది. ఆయన ప్రత్యేక చొరవతో ఎర్రంపేటరాజవరం గ్రామాల మధ్య 3 కిలోమీటర్ల డొంక రోడ్డు నిర్మాణం కేవలం మూడు నెలల్లోనే పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. గతంలో ఈ దారి బురదమయంగా ఉండి, ప్రయాణానికి తీవ్ర ఇబ్బందికరంగా ఉండేది. స్థానికులు, రైతులు పడుతున్న కష్టాలను తెలుసుకున్న పవన్ కల్యాణ్, ఈ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నుంచి రూ.60 లక్షల నిధులు మంజూరు చేయించి పనులను వేగవంతం చేశారు. ఈ రోడ్డు నిర్మాణంతో దాదాపు 12,500 మంది ప్రజలకు రవాణా కష్టాలు తీరాయి. ముఖ్యంగా రైతులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా మారింది.

## ఝార్ఖండ్ లో కుప్పకూలిన ఎయిర్ అంబులెన్స్

ఝార్ఖండ్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఏడుగురు ప్రయాణికులతో రాంచీ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ అంబులెన్స్ చత్రా జిల్లాలో కుప్పకూలింది. ఈ ఘటనలో విమానంలో ఉన్న ఏడుగురూ మరణించినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్‌కు చెందిన బీచ్‌క్రాఫ్ట్ జ90 ఎయిర్ అంబులెన్స్ నిన్న రాత్రి 7:11 గంటలకు రాంచీ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయింది. తీవ్ర గాయాలపాలైన సంజయ్ కుమార్ అనే రోగికి మెరుగైన చికిత్స అందించేందుకు ఢిల్లీకి తరలిస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. టేకాఫ్ అయిన సుమారు 20 నిమిషాల తర్వాత, వాతావరణం అనుకూలంగా లేనందున మార్గాన్ని మళ్లించాలని పైలట్ కోరినట్లు, ఆ తర్వాత విమానంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న ఇద్దరు పైలట్లు, రోగి, ఒక డాక్టర్, పారామెడిక్, ఇద్దరు సహాయకులు సహా మొత్తం ఏడుగురూ మరణించినట్లు చత్రా డిప్యూటీ కమిషనర్ కీర్తిశ్రీ జి వెల్లడించారు. అయితే, మృతుల సంఖ్యపై భిన్నమైన కథనాలు వెలువడుతున్నాయి. ఈ ఘటనలో ఒకరు మాత్రమే మరణించి, ఆరుగురు ప్రాణాలతో బయటపడ్డారని కొన్ని నివేదికలు పేర్కొంటుండటంతో కాస్త గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా యంత్రాంగం, సహాయక బృందాలు చత్రా జిల్లాలోని సిమారియా అటవీ ప్రాంతంలోని ప్రమాద స్థలానికి చేరుకున్నాయి.

# పనితీరు ఆధారంగా ఉద్యోగులకు వెయిటేజ్...

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో ప్రజల మన్ననలు పొందుతూ, అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బందిని గుర్తించడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. పనితీరు సరిగా లేని వారిని గుర్తించి ప్రేరణ కల్పించడంతో పాటు, బాగా పనిచేస్తున్న వారిని ప్రశంసించడం ద్వారా ఉద్యోగుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం పెరుగుతుందని ఉన్నతాధికారులు సైతం ఏకీభవించారు. "ప్రతి నెలా ఉత్తమ పనితీరు కనబరిచే ఉద్యోగులను గుర్తించి, వారికి అభినందన లేఖలు పంపాలి. ఈ ప్రశంసలను వారి సర్వీస్ రికార్డులలో కూడా నమోదు చేయాలి. ఇది వారి కెరీర్‌కు దోహదపడుతుంది," అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ విధానం ప్రభుత్వ ఉద్యోగులను అభినందించడంలో ఒక కొత్త అధ్యాయమని, దీని ద్వారా పాలనలో మరింత సానుకూల మార్పు వస్తుందని అధికారులు పేర్కొన్నారు. వైద్యారోగ్యం, దేవదాయ శాఖల పనితీరుపై సమీక్షిస్తూ సీఎం పలు కీలక సూచనలు చేశారు. "ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బోధనాసుపత్రుల వరకు అన్ని స్థాయిల్లో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను బాధ్యులను చేయండి. పారిశుద్ధ్యం, వైద్య పరికరాల నిర్వహణపై ఆసుపత్రుల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు పూర్తి బాధ్యత అప్పగించాలి. ఏ ఆస్పత్రిలోనూ వైద్యుల కొరత ఉండకూడదు. అవసరమైన చోట తక్షణం నియామకాలు చేపట్టేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకోండి" అని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే, దేవాలయాల్లో భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచాలని, ఆధ్యాత్మిక వాతావరణం ఉండేలా చూడాలని దేవదాయ శాఖ అధికారులకు సూచించారు. రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "రెవెన్యూ శాఖకు ఉన్న చెడ్డపేరు పోవాలి. గతంతో పోల్చుకుంటే స్పష్టమైన మార్పు కనిపించాలి.

## రాజమండ్రి కల్తీ పాల ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష

రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి నలుగురు మృతి చెందడం, మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. రాజమండ్రిలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్, లాలాచెరువు ప్రాంతాల్లో కల్తీ పాలు సేవించడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇప్పటివరకు నలుగురు మరణించగా, 13 మందికి పైగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో చాలామంది కిడ్నీలు పూర్తిగా పనిచేయకపోవడంతో (అనూరియా) బాధపడుతున్నట్లు వైద్యులు ప్రాథమికంగా గుర్తించారు.

## శతాధిక వసంతాల ప్రస్థానం ముగిసింది!

- రజాకార్ల వ్యతిరేక పోరాట కాలం నాటి సాక్షి
- 106 ఏళ్ల పరిపూర్ణ జీవనం
- బేగంపేటలో శతాధిక వృద్ధురాలు మృతి



**రాజాపేట, ఫిబ్రవరి 23 (తొలివెలుగు):** రాజాపేట మండలం బేగంపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు వల్లిమెల లక్ష్మీ (106) సోమవారం కన్నుమూశారు. ఆమె మృతితో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. లక్ష్మీ భర్త హన్మంత్ స్వాతంత్ర సమరయోధుడిగా సేవలందించి జైలు జీవితం గడిపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్వాతంత్ర్య పోరాట దశతో పాటు రజాకార్ల అల్లర్ల కాలాన్ని కూడా ప్రత్యక్షంగా చూశారని గ్రామ పెద్దలు గుర్తుచేశారు. ఆ కాలం నాటి సంఘటనలకు ఆమె ప్రత్యక్ష సాక్షిగా నిలిచినట్లు పేర్కొన్నారు. ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడుతో కూడిన పెద్ద కుటుంబాన్ని సక్రమంగా నడిపించిన లక్ష్మీ, సుఖదుఃఖాలు, బాధ్యతలు, అనుభవాలతో నిండిన 106 ఏళ్ల పరిపూర్ణ జీవితం గడిపినవారిగా గ్రామస్థులు తెలిపారు. మనుమలు, మనుమరాళ్లతో సంతోషంగా గడిపిన ఆమె జీవితం గ్రామానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇండ్ల అనూష సుమన్, మాజీ ఎంపీటీసీ బోగ హరినాథ్, ఉపసర్పంచ్ బద్దం మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ పంబ కర్ణాకర్ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## శిక్షణకు రాజపేట సర్పంచులు

- పోచంపల్లిలో ఐదు రోజుల శిక్షణ ప్రారంభం




**రాజపేట, ఫిబ్రవరి 23 (తొలివెలుగు):** రాజపేట మండలంలోని నూతనంగా ఎన్నికైన సర్పంచులు సోమవారం శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామాభివృద్ధి, పంచాయతీ పరిపాలన, నిధుల సమర్థ వినియోగం, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పోచంపల్లిలోని స్వామి రామానంద్ తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధి, పారదర్శక పాలన, రికార్డుల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలు విధానాలపై నిపుణులు మార్గదర్శనం చేయనున్నారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు శిక్షణలో చురుకుగా పాల్గొని గ్రామాభివృద్ధికి దోహదపడేలా సూచనలు అమలు చేయాలని అధికారులు పేర్కొన్నారు.


## యూరియా యాప్‌ను రద్దు చేయాలి

- గాంధీ చౌరస్తాలో బీఆర్ఎస్ రాస్తారోకో
- గులాబీ శ్రేణుల నిరసన.. స్తంభించిన ట్రాఫిక్

**రాజపేట, ఫిబ్రవరి 23 (తొలివెలుగు):** రాజపేటలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు సోమవారం గాంధీ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. గులాబీ శ్రేణుల నిరసనతో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించింది. యాప్ ద్వారా యూరియా బుకింగ్ సాధారణ రైతులకు అందుబాటులో లేకపోవడంతో పంటల సాగుకు తీవ్ర ఆటంకం కలుగుతోందని నేతలు ఆరోపించారు. సాంకేతిక సమస్యలు, సర్వర్ లోపాల కారణంగా రైతులు ఎరువులు పొందడంలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. యాప్ విధానాన్ని తక్షణమే ఎత్తివేసి, నేరుగా ఎరువుల దుకాణాల ద్వారా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. రాస్తారోకో కారణంగా రహదారిపై వాహనాల రాకపోకలు కొంతసేపు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకుని నిరసనకారులను సమాధానపరిచి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మండల ఉపాధ్యక్షుడు ఎర్రగోకుల జశ్వంత్, పట్టణ అధ్యక్షుడు బెడద వీరేశం, మాజీ రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కుంటి మధుసూదన్ రెడ్డి, మాజీ మదర్ డెయిరీ డైరెక్టర్ చింతలపూరి వెంకటరామిరెడ్డి, రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గిరిపై వైభవంగా ధ్వజారోహణం







- రాజాపేటలో వేడుకగా శ్రీ వేంకటేశ్వర స్వామి ద్వితీయ బ్రహ్మోత్సవాలు
- శాస్త్రోక్తంగా ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ
- నేడు ఎదుర్కోలు మహోత్సవం

**రాజాపేట, ఫిబ్రవరి 23 (తొలివెలుగు):** రాజాపేట మండలం రేణిగుంట రెవెన్యూ పరిధిలోని శ్రీ గిరి సంకల్ప సిద్ధి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య మంగళగిరి నవీన్ ఆచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం పూజా కార్యక్రమాలను నిర్వహించింది. ఆలయ ట్రస్ట్ సభ్యులు, దాతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమయ్యాయి. ఆరాధన, నివేదన, తీర్థప్రసాద గోష్టి, శ్రీ విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, సూర్యకాంత శైలజాగ్ని ప్రజ్వలన, యాగశాల ప్రవేశం, శాంతిపాఠం, చతుష్టానార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అగ్ని ప్రతిష్ఠ, వైనతేయ ఇష్టి, నిత్య పూర్ణాహుతి, ధ్వజారోహణం, బలిహరణ, మంగళశాసనం, శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, మూలమంత్ర హోమాలు, భేరి పూజ, దేవతాహ్వానం వంటి వైదిక కర్మలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పచ్చని తోరణాలు, పూలమాలలు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

**నేడు ఎదుర్కోలు మహోత్సవం:**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం శ్రీ మహాలక్ష్మీ గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎదుర్కోలు మహోత్సవాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# మెడల్స్ 'పావని'తం!

- పతకాల 'పావని'.. ఖాకీ వనంలో క్రీడా కిరణం
- ఒకేసారి ఆరు మెడల్స్ సాధించిన కానిస్టేబుల్
- రాష్ట్రస్థాయి పోటీల్లో అదరగొట్టిన ప్రతిభ
- తెలంగాణ పోలీసు శాఖ గర్వించేలా విజయాలు



**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 23 (తొలివెలుగు):** యాదగిరిగుట్టలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వాసర్ల పావని నాగేందర్ క్రీడా రంగంలో విశేష ప్రతిభ కనబరిచి ఖాకీ వనంలో క్రీడా కిరణంగా నిలిచారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ నిర్వహించిన నాల్గవ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఆమె మూడు గోల్డ్, ఒక సిల్వర్, మూడు బ్రాంజ్ పతకాలను సాధించి పోలీసు శాఖకు గర్వకారణమయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో సేవలందిస్తున్న పావని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందినవారు. క్రీడా ప్రతిభకు నిలువెత్తు రూపంగా నిలిచిన ఆమె వివిధ విభాగాల్లో ప్రతిభ చాటుకున్నారు. కబడ్డీ, షాట్‌పుట్, చేయి కుస్తీ పోటీల్లో గోల్డ్ పతకాలు సాధించగా, వాలీబాల్‌లో సిల్వర్ పతకం అందుకున్నారు. బ్యాడ్మింటన్, ఉమెన్ డబుల్స్, మిక్స్ డబుల్స్ విభాగాల్లో బ్రాంజ్ పతకాలు గెలుచుకుని మొత్తం ఆరు మెడల్స్ కైవసం చేసుకున్నారు. విశిష్ట ప్రదర్శన కనబరిచిన పావనిని యాదగిరిగుట్ట డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, సీఐ భాస్కర్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సహచర పోలీసులు, అధికారులు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆమె విజయాలు తెలంగాణ పోలీసు శాఖకు గర్వకారణమని కొనియాడారు. ఇదిలా ఉండగా జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించనున్న కబడ్డీ పోటీలకు పావని ఎంపిక కావడం విశేషం. పోలీసు శాఖ అందిస్తున్న ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటుకోవాలని సంకల్పంతో ఉన్నట్లు పావని తెలిపారు.









## గుట్టపై చిన్నారుల 'దశావతార' విన్యాసం

- మంత్రముగ్ధులైన భక్తులు.. సెల్ఫీలతో సందడి

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 23 (తొలివెలుగు):** శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం స్వామి అమ్మవార్ల అలంకారాలు, వాహన సేవలకు ముందు చిన్నారులు ప్రదర్శిస్తున్న దశావతారాల అలంకారాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గత నాలుగు రోజులుగా చిన్నారులు వివిధ వేషధారణలతో దశావతార రూపాల్లో దర్శనమిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. నరసింహ అవతారంతో పాటు మత్స్య, కూర్మ, వరాహ, వామన తదితర అవతారాల రూపాల్లో చిన్నారులు చేసిన ప్రదర్శనలు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. అలాగే చిన్నారుల నాట్య ప్రదర్శనలు ఉత్సవాలకు మరింత భక్తిరసాన్ని తీసుకువస్తున్నాయి. సేవలకు ముందు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపుతున్నాయి. దశావతారాల అలంకారాల్లో పాల్గొన్న చిన్నారులతో స్థానికులు, భక్తులు ఫోటోలు దిగుతూ వారిని అభినందిస్తున్నారు. చిన్నారుల ప్రతిభను చూసి పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

- మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి హెచ్చరిక

**వలిగొండ, ఫిబ్రవరి 23 (తొలివెలుగు):** పంట ఎరువులను అధిక ధరలకు విక్రయించే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని వలిగొండ మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి తెలిపారు. వలిగొండ మండలంలోని అరూర్ గ్రామ పరిధిలో ఉన్న న్యూ వరుణ్ ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో యూరియాను అధిక ధరకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదు అందిన వెంటనే ఆమె దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులతో మాట్లాడి యూరియా అమ్మకపు ధర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం దుకాణ యజమానితో సమావేశమై, ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట రిటైల్ ధర (ఎంఆర్‌పీ)కే ఎరువులను విక్రయించాలని స్పష్టం చేశారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో అరూర్ వ్యవసాయ విస్తరణాధికారి రమేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.






## ఫర్టిలైజర్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

**- పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ చేపట్టాలి**

**- రాస్తారోకోలో సీపీఎం డిమాండ్**

**వలిగొండ, ఫిబ్రవరి 23 (తొలివెలుగు):** ప్రభుత్వం అమలు చేస్తున్న ఫర్టిలైజర్ యాప్ కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ, వెంటనే యాప్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే సింగిల్ విండో కేంద్రాలు, లైసెన్సు కలిగిన దుకాణాల ద్వారా యూరియాను సరఫరా చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. సోమవారం సీపీఎం వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియా పంపిణీ చేయాలనే ప్రభుత్వ నిర్ణయం అనాలోచితమని విమర్శించారు. రాష్ట్రంలో అనేక మంది రైతులు నిరక్షరాస్యులుగా ఉండడంతో యాప్ వినియోగం సాధ్యం కావడం లేదని తెలిపారు. మరోవైపు కొందరు మధ్యదళారీలు ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని పెద్ద భూస్వాములకు, ఎక్కువ ఎరువులు కొనుగోలు చేసే వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. దీంతో పేద, చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం పంటలు పొట్టదశకు చేరువవుతున్న తరుణంలో యూరియా అత్యవసరంగా అవసరమైందని, సరఫరాలో జాప్యం కారణంగా రైతులు దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే యాప్ విధానాన్ని ఉపసంహరించి పాత విధానంలోనే యూరియా పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం మండల కార్యదర్శి కందడి సత్తిరెడ్డి అధ్యక్షత వహించగా, సిపిఎం మండల కమిటీ సభ్యులు కొండే కిష్టయ్య, కవిడే సురేష్, దుబ్బ లింగం, బూడిద మనమ్మ, మంగ బాలయ్య, చెరుకు జంగయ్య, కొండూరు సత్తయ్య, బొక్క వెంకటరెడ్డి, శీలం ఇందిర, కందగట్ల సాయి రెడ్డి, తుమ్మల నరసింహారెడ్డి, ఈర్ల రమేష్, మంగ నరసింహ, చెరుకు స్వామి, మారబోయిన ముత్యాలు, దయ్యాల సత్తయ్య, గంగాపురం వెంకటేశం, ఎడవెల్లి రాములు, నరసింహ, సత్తయ్య, కర్ణాకర్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

- ఉద్యమకారుల సబ్ కమిటీ ఏర్పాటుపై హర్షం
- మాట తప్పని కాంగ్రెస్ ప్రభుత్వం: ఉద్యమకారుల ఫోరం




**వలిగొండ, ఫిబ్రవరి 23 (తొలివెలుగు):** వలిగొండ పట్టణ కేంద్రంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, స్థానిక శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాలాభిషేకాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం హర్షణీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చినట్లయితే తప్పక నిలబెట్టుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, గౌరవ సలహాదారులు చిలుగూరి సత్తిరెడ్డి, బత్తిని సహదేవ్ గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య, కాసుల వెంకన్న, వార్డు సభ్యుడు బత్తిని నాగేష్ గౌడ్, పంజాల రమేష్, కదిరేని స్వామి, మల్ల వెంకటేశం, ఎక్కల దేవి శ్రీనివాస్, కొండూరు నీలమ్మ, ఐటి పాముల పుష్ప, కొండూరు శ్రీరాములు, సత్తయ్య, కన్నెకంటి శ్రీనివాసచారి, ఎదురుగట్ల యాదగిరి, చిన్న యాదగిరి, సందయ్య, లక్ష్మయ్య, సుంకి కృష్ణమూర్తి, సుంకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా ఏది? యాప్ తిప్పలేంది?


- రైతును రాజు చేస్తామన్న హామీలు ఏమాయె?
- యూరియా యాప్‌తో అన్నదాతల అరిగోసలు కనిపించట్లేదా?
- రైతు హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు పైళ్ల మల్లారెడ్డి



**వలిగొండ, ఫిబ్రవరి 23 (తొలివెలుగు):** ఓట్ల కోసం రాజకీయ నాయకులు రైతును రాజు చేస్తామని ఇచ్చిన హామీలు వట్టిమాటలుగానే మిగిలిపోయాయని రైతు హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు పైళ్ల మల్లారెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెట్టుబడి సాయం అందుతుందన్న ఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయని అన్నారు. డిసెంబర్‌లో ఇస్తామని ప్రకటించిన రైతు భరోసాను సంక్రాంతికి ఇస్తామని చెప్పి, తరువాత మున్సిపల్ ఎన్నికల తర్వాత అని వాయిదా వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శాటిలైట్ ద్వారా పంట వేసిన భూములకు మాత్రమే రైతు భరోసా అందిస్తామని చెప్పడం ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పించుకోవడమేనని ఆరోపించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ వల్ల రైతులకు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఎదురవుతోందని అన్నారు. యూరియా కోసం మొబైల్‌లో బుకింగ్ చేసేటప్పుడు జీరోలు మాత్రమే కనిపిస్తున్నాయని, బస్తాలు అందుబాటులో లేకపోవడం రైతులకు తీవ్ర నిరాశ కలిగిస్తోందన్నారు. కేవలం నిమిషాల వ్యవధిలోనే బస్తాలు అయిపోవడం మిగిలిన రైతులకు అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. అదేవిధంగా కరెంటు కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోజులో కొన్ని గంటలు విద్యుత్ సరఫరా నిలిపివేయడం వల్ల పంటలకు సకాలంలో సాగునీరు అందక దిగుబడులు తగ్గిపోతున్నాయని అన్నారు.ఏది ఏమైనప్పటికీ రైతు భరోసాను సకాలంలో అందించి, పంటలకు అవసరమైన ఎరువులను ఎలాంటి ఆంక్షలు లేకుండా సరఫరా చేసి, నిరంతర విద్యుత్‌ను కల్పిస్తేనే రైతుకు న్యాయం చేసిన వారవుతారని ప్రభుత్వం పైళ్ల మల్లారెడ్డి డిమాండ్ చేశారు.

# నవమోహన కృష్ణుడై.. నరసింహుడు!

- సింహంపై విహరించిన యాదాద్రి లక్ష్మీనరసింహుడు
- కనువిందుగా సింహవాహన సేవ.. ఉగ్రరూప వైభవం
- భక్తులతో కిటకిటలాడిన యాదాద్రి గిరి






**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 23 (తొలివెలుగు):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి పారవశ్యంతో కొనసాగుతున్నాయి. సోమవారం గోవర్ధన గిరిధారి అలంకారం, సాయంత్రం సింహవాహన సేవలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తాయి. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సుప్రభాత సేవ అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గోవర్ధన గిరిని ఎత్తి గోపాలకులను రక్షించిన శ్రీకృష్ణ తత్వాన్ని ప్రతిబింబించే గోవర్ధన గిరిధారి రూపంలో స్వామివారిని అలంకరించారు. పుష్పాలంకరణలు, రత్నాభరణాలు, సంప్రదాయ వస్త్రాలతో అలంకరించిన స్వామివారి దివ్యరూపం భక్తులకు కనువిందు చేసింది. ధర్మరక్షణ, భక్తపరిపాలన, ప్రకృతి పరిరక్షణ సందేశాలు ఈ అలంకారంలో ప్రతిఫలించాయని అర్చకులు తెలిపారు. సాయంత్రం బ్రహ్మోత్సవాల ప్రధాన ఆకర్షణగా సింహవాహన సేవ ఘనంగా జరిగింది. సింహంపై విరాజిల్లిన లక్ష్మీనరసింహుడి ఉగ్రరూపం భక్తులను ముగ్ధులను చేసింది. సింహవాహనం ధైర్యం, శౌర్యానికి ప్రతీకగా, అధర్మంపై ధర్మవిజయానికి సంకేతంగా నిలిచింది. విద్యుద్దీపాలంకరణల మధ్య మంగళవాయిద్యాల నాదంతో స్వామివారి ఊరేగింపు ఆలయ ప్రదక్షిణ మార్గంలో సాగింది. "జై లక్ష్మీనరసింహ" నినాదాలతో యాదాద్రి గిరి మారుమోగింది. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు వాహన సేవను తిలకిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. కొందరు ప్రత్యేక పూజలు నిర్వహించగా, మరికొందరు అన్నదాన సేవలో పాల్గొన్నారు. భక్తిగీతాలు, హరికథా కార్యక్రమాలు బ్రహ్మోత్సవాలకు మరింత ఆధ్యాత్మిక శోభను చేకూర్చాయి. విద్యుద్దీపాలతో వెలుగొందిన ఆలయ గోపురాలు రాత్రివేళల్లో దివ్యక్షేత్రంగా



దర్శనమిచ్చాయి. మొత్తం మీద గోవర్ధన గిరిధారి అలంకారం, సింహవాహన సేవలు బ్రహ్మోత్సవాల్లో విశేష ఆకర్షణగా నిలిచాయి.







## జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్‌కు ఆమోదం

**- దివ్యాంగుల కోసం ప్రత్యేక 'దివ్యాంజన్ సెక్షన్' ప్రారంభం**

**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 23 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సర్వసభ్య సమావేశం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఎండి అవైస్ ఉర్ రెహమాన్ చిస్తి అధ్యక్షతన నిర్వహించబడింది. సమావేశంలో 2026-27 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలను ఆమోదించారు. అనంతరం ఆ ప్రతిపాదనలను పౌరసంచాలకులు శాఖ, హైదరాబాద్‌కు పంపాలని తీర్మానించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం, జిల్లాలోని శాఖా గ్రంథాలయాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది, జిల్లా విద్యాశాఖ సిబ్బంది, జిల్లా ఉపసంచాలకులు (వయోజన విద్య), జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి యం. సుధీర్, గ్రంథాలయ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'దివ్యాంజన్ సెక్షన్'ను ప్రారంభించారు. ఈ విభాగం ద్వారా దివ్యాంగులకు అవసరమైన పఠన వనరులు, ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు.

## కొత్త భవనానికి తహశీల్దార్ కార్యాలయం మార్పు

- నేటి నుంచి అందుబాటులోకి సేవలు: తహశీల్దార్ వీరాబాయి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 23 (తొలివెలుగు):** చౌటుప్పల్ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం నూతన భవనంలోకి మారినట్లు తహశీల్దార్ వీరాబాయి తెలిపారు. పాత కార్యాలయ భవనం నుండి పట్టణంలోని పద్మావతి ఫంక్షన్ హాల్ పక్కన నూతనంగా నిర్మించిన భవనానికి కార్యాలయాన్ని మార్చినట్లు పేర్కొన్నారు. ఇకపై ధరణి సేవలు, ఆదాయ ధృవీకరణ పత్రాలు, కుల ధృవీకరణ పత్రాలు, భూ సంబంధిత రెవెన్యూ సేవలన్నీ ఈ కొత్త భవనంలోనే అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు తమ అవసరాల కోసం నేరుగా నూతన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యాలయం మార్పును గమనించి రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని, ఇకపై అన్ని సేవల కోసం కొత్త భవనానికే రావాలని తహశీల్దార్ విజ్ఞప్తి చేశారు.





## ప్రజావాణి వినతులపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలి

**- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**- ప్రజావాణిలో 54 వినతులు స్వీకరణ**

**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 23 (తొలివెలుగు):** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 54 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా వచ్చిన అర్జీల వివరాలను వెల్లడించారు. రెవెన్యూ శాఖకు 26, పంచాయతీ శాఖకు 7, ఇరిగేషన్‌కు 5, విద్యుత్ శాఖకు 3, ఎంప్లాయిమెంట్ టీమ్‌కు 3, వ్యవసాయ శాఖకు 2, ఈఈ డివిజన్‌కు 2, మున్సిపాలిటీకి 2, గ్రామీణాభివృద్ధి శాఖకు 2, ఎస్సీ కార్పొరేషన్ మరియు సంక్షేమ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వివిధ శాఖలకు వచ్చిన అర్జీలను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ జయమ్మ, జెడ్పీ సీఈఓ శోభ రాణి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# అమ్మకాల్లో సరికొత్త రికార్డ్: 5 లక్షల మంది కొన్నారు!

భారతదేశంలో బజాజ్ చేతక్ లాంచ్ అయినప్పటి నుంచి ఐదు లక్షల అమ్మకాలను అధిగమించింది. నవంబర్ 2023లో 1,00,000 అమ్మకాల మైలురాయిని చేరుకున్న ఈ స్కూటర్.. తాజాగా 5,10,000 యూనిట్ల అమ్మకాలను నమోదు చేసింది. 2020లో ఇండియన్ మార్కెట్లో అరంగేట్రం చేసినప్పటి నుంచి బజాజ్ చేతక్ 46 నెలల్లో లక్ష యూనిట్ల అమ్మకాల మైలురాయిని చేరుకుంది. అయితే గడిచిన 10 నెలల కాలంలోనే 2.06 లక్షల కంటే ఎక్కువ సేల్స్ పొందగలిగింది. మొత్తం మీద ఐదు లక్షల సేల్స్ అధిగమించింది. దీన్నిబట్టి చూస్తే దేశీయ విఫణిలో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో పెరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. బజాజ్ చేతక్ అమ్మకాలు పెరగడానికి ప్రధాన కారణం.. ఇది 3001, 3501, 3502, 3503 అనే వేరియంట్లలో అందుబాటులో ఉండటం మాత్రమే కాకుండా, దేశవ్యాప్తంగా 3,800 కంటే ఎక్కువ టచ్‌పాయింట్‌లతో కూడిన సర్వీస్ నెట్‌వర్క్ కూడా అని తెలుస్తోంది. ఈ స్కూటర్లు లేటెస్ట్ డిజైన్ కలిగి.. 3 కిలోవాట్ బ్యాటరీ, 3.5 కిలోవాట్ బ్యాటరీ ఎంపికలో అబందుబాటులో ఉన్నాయి. దీని ప్రారంభ ధర రూ.99,900 (ఎక్స్ షోరూమ్).

## జీఎస్టీ 2.0 ఎఫెక్ట్: భారీగా తగ్గనున్న టీవీ ధరలు



దిల్లీ: రేపటి నుంచి కొత్త జీఎస్టీ రేట్లు అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను బదిలీ చేసేందుకు టెలివిజన్ తయారీదారులు తమ ఉత్పత్తుల ధరలను తగ్గించారు. టీవీల మీద రూ.2,500 నుంచి రూ.85,000 వరకు తగ్గింపు ప్రకటించారు. దీంతో వినియోగదారులకు పండగ సీజన్ ఆఫర్లతో పాటు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనమూ కలిసి రానుంది. 32 అంగుళాల పైబడిన టీవీలపై జీఎస్టీ రేటు 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గింది. దీంతో తయారీదారులు స్కీన్ సైజులు, స్పెసిఫికేషన్ల ఆధారంగా ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. సోనీ, ఎల్‌జీ, పానాసోనిక్ వంటి అగ్ర టీవీ బ్రాండ్లు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చే కొత్త ధరల జాబితాను విడుదల చేశాయి. టీవీలతో పాటు సౌండ్ బార్లు, పార్టీ స్పీకర్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరుగుతాయని అంచనా. ఏ టీవీపై ఎంత రేటు తగ్గిందో చూద్దాం.

**సోనీ ఇండియా..**

- 43 నుంచి 98 అంగుళాల వరకు ఉన్న బ్రావియా టీవీ మోడళ్లపై రూ.5వేల నుంచి రూ.71 వేల వరకు ధరలు తగ్గించనుంది.
- 43 అంగుళాల బ్రావియా 2 రూ.59,900 నుంచి రూ.54,900కి తగ్గనుంది.
- 55 అంగుళాల టీవీ 7 ధర రూ.2.80 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు తగ్గింది.
- 98 అంగుళాల టాప్ ఎండ్ బ్రావియా 5 రూ.9 లక్షల నుంచి రూ.8.29 లక్షలకు దిగి రానుంది.
- ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా..
- • 43 అంగుళాల నుంచి 100 అంగుళాల వరకు ఉన్న మోడళ్లపై రూ.2,500 నుంచి రూ.85,800 వరకు ధరలు తగ్గిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది.
- 43 అంగుళాల మోడల్ రూ.30,990 నుంచి రూ.28,490 వరకు తగ్గనుంది.
- 65 అంగుళాల టీవీ ధర రూ.71,890 నుంచి రూ.68,490 తగ్గనుంది.

# ఇంటిపై సౌరకాంతులు!

## పెరుగుతున్న నెలవారీ విద్యుత్ చార్జీలు

## ప్రత్యామ్నాయం దిశగా వినియోగదారుల అడుగులు

## గ్రేటర్‌లో రూఫ్‌టాప్ నెట్‌మీటరింగ్‌కు పెరుగుతున్న ఆదరణ

## అందుబాటులోకి 'పీఎం ముఫ్త్ బిజ్లీ యోజన పథకం' పోర్టల్

## నెలకు 300 యూనిట్లు ఉచితం.. రాయితీపై బ్యాంకు రుణ సౌలభ్యం



హైదరాబాద్‌లోనే అతిపెద్ద గేటెడ్ కమ్యూనిటీగా గుర్తింపు పొందిన మాదాపూర్‌లోని ఫార్చ్యూన్ టవర్స్‌పై నిర్వాహకులు 250 కిలోవాట్స్ సోలార్ రూఫ్ టాప్ పలకను ఏర్పాటు చేసుకున్నారు. రోజుకు సగటున వెయ్యి యూనిట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. నెలకు సగటున రూ.3 లక్షల వరకు విద్యుత్ బిల్లు ఆదా అవుతోంది. ఈ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు నిర్వాహకులు పెట్టిన పెట్టుబడి అంతా మరో ఐదేళ్లలో తీరిపోతోంది. ఆ తర్వాత వారికి పూర్తిగా సోలార్ విద్యుత్ ఉచితంగా అందనుంది. ఇలా వీరొక్కరే కాదు గ్రేటర్‌లో సుమారు 3,500 మంది వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ పలకలను ఏర్పాటు చేసుకుని, సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకుంటున్నారు. ఇంటిపై ఉత్పత్తి అయిన విద్యుత్‌తో సొంత అవసరాలు తీర్చుకుంటూ.. మిగిలిన విద్యుత్‌ను డిస్కంకు విక్రయిస్తున్నారు. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లలో సౌర విద్యుత్ వెలుగులు నింపే లక్ష్యంతో తాజాగా కేంద్రం 'పీఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజ్లీ యోజన' పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. రేషన్‌కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి నెలకు సగటున 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఉచితంగా అందించే కార్యక్రమంలో భాగంగా కొత్తగా రూఫ్‌టాప్ సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవాలని భావించే వారికి పలు ప్రోత్సాహకాలు అందజేస్తుంది. ఇంటిపై మూడు కిలోవాట్ల సౌరపలకలు ఏర్పాటు చేయాలంటే 225 చదరపు అడుగుల విస్తీర్ణం అవసరం. ఒక కిలోవాట్ సౌరపలక రోజుకు సగటున 4 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. మూడు కిలోవాట్ల సామర్థ్యం ఉన్న పలకలు ఏర్పాటు చేసుకుంటే నెలకు సగటున 360 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. ఏడాదికి 4,320 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. ఇంటి అవసరాలు నెలకు 200 యూనిట్లు పోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకోవచ్చు. ఇందుకు ప్రస్తుత ధర ప్రకారం యూనిట్‌కు రూ.5.05 చెల్లిస్తుంది. మూడు కిలోవాట్లకు రూ.1.80 లక్షలు ఖర్చవుతుంది. గతంలో రాయితీ కిలోవాట్‌కు రూ.14 వేల చొప్పున మూడు కిలోవాట్లకు రూ.42 వేలు లభించేది. దీంతో చాలామంది విముఖత చూపేవారు. ప్రస్తుతం ఈ సబ్సిడీని రూ.78 వేలకు పెంచింది. అంతేకాదు మిగిలిన మొత్తం చెల్లింపునకు రాయితీపై బ్యాంకుల నుంచి రుణాలు పొందేలా కేంద్రం ఏర్పాటు చేసింది. ఒక రకంగా చెప్పాలంటే పైసా ఖర్చు లేకుండా యూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఉత్పిత్తి అయిన విద్యుత్‌లో ఇంటి అవసరాలు పోగా, మిగిలిన విద్యుత్‌ను నెట్‌మీటరింగ్ ద్వారా డిస్కంకు విక్రయించడం ద్వారా వచ్చే సొమ్ముతో బ్యాంకు రుణం తీర్చవచ్చు.

### 40 మందికిపైగా దరఖాస్తు

సౌరపలకల జీవితకాలం 25 ఏళ్లను పరిగణలోకి తీసుకుంటే 5.32 సంవత్సరాల్లోనే పెట్టిన పెట్టుబడి అంతా తిరిగి వస్తుందని చెబుతున్నారు. మిగిలిన కాలానికి ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకోవచ్చు. సౌర విద్యుత్‌తో పర్యావరణ ప్రయోజనాలు లేకపోలేదు. మూడు కిలోవాట్ల సోలార్ ప్యానల్ల ఏర్పాటుతో 25 ఏళ్లలో 85 టన్నుల కార్బన్‌డైయాక్సైడ్‌ను తగ్గించిన వారవుతారు. ఇదిలా ఉంటే సోలార్ విద్యుత్ ఉత్పత్తిదారులను ప్రోత్సహించేందుకు కేంద్రం జాతీయ స్థాయిలో 'పీఎం సూర్య ఘర్' పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే గ్రేటర్ జిల్లాల నుంచి 40 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఔత్సాహికులు టీఎస్ఎస్‌పీడీపీఎల్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి డిస్కం పేరు, కరెంట్ కనెక్షన్, ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ, ఆధార్ నంబర్ వంటి వివరాలను పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో నమోదు చేస్తే సరిపోతుంది. ఎంపిక చేసిన కంపెనీల సోలార్ పలకలు, రాయితీపై రుణాలు ఇచ్చే బ్యాంకులు, టెక్నిషియన్ల వివరాలు ఉంటాయి. పలకల ఇన్‌స్టాలేషన్ తర్వాత నెట్‌మీటరింగ్ ద్వారా గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు.

# ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్‌లో భారత్ టాప్



### అంతర్జాతీయ మెచ్యూరిటీ సూచీలో స్థానం

### కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: భారత కో%-%వర్కింగ్ స్పేస్ మార్కెట్ అంతర్జాతీయ మెచ్యూరిటీ సూచీలో మొదటి స్థానంలో నిలిచినట్టు కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది. యూకే, ఫ్రాన్స్, యూఎస్, జపాన్, సింగపూర్ మార్కెట్లను భారత్ వెనక్కి నెట్టేయడం గమనార్హం. 'ఫ్లెక్సిబుల్ ఆఫీస్‌లో ప్రపంచ ధోరణలు, 2025' పేరుతో ఈ సంస్థ ఒక నివేదికను విడుదల చేసింది. "ప్రపంచ వ్యాప్తంగా వివిధ మార్కెట్లలోని మొత్తం ఆఫీస్ స్పేస్‌లో ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ భిన్నంగా ఉంది. కొన్ని అభివృద్ధి చెందిన మార్కెట్లలో ఫ్లెక్సిబుల్ ఆఫీస్ పెద్ద స్థాయిలో లేదు. అదే కొన్ని వర్ధమాన మార్కెట్లలో ఫ్లెక్సిబుల్ ఆఫీస్ ప్రొవైడర్లు బలమైన ప్రాతినిధ్యం కలిగి ఉన్నారు"అని తెలిపింది. కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ మెచ్యూరిటీ ఇండెక్స్‌లో భారత్ 100 స్కోరు సాధించింది. ప్రపంచంలో పేరొందిన ఆఫీస్ మార్కెట్లు అయిన యూకే 98, ఫ్రాన్స్ 97, యూఎస్ 81, జపా న్, సింగపూర్ 77% స్కోరుతో భారత్ కంటే వెనుకనే ఉన్నాయి. మొత్తం ఆఫీస్ స్పేస్ పరిమాణంలో ఫ్లెక్సిబుల్ స్పేస్ (అన్ని వసతులతో, కోరుకున్నన్ని రోజులకు అద్దెకు లభించేది) ఎంతుంది? ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ ప్రొవైడర్ల సంఖ్య ఆధారంగా కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఈ నివేదికను రూపొందించింది.

# నిస్సాన్ మాగ్నైట్‌కు రీకాల్: 1500 కార్లు వెనక్కి!




నిస్సాన్ కంపెనీ అక్టోబర్ 2024లో మాగ్నైట్ ఫేస్‌లిఫ్ట్ వెర్షన్‌ను విడుదల చేసింది. దీంతో సంస్థ లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ సెటప్‌తో భారతదేశంలో తయారు చేసిన మాగ్నైట్‌ను సౌదీ అరేబియాకు ఎగుమతి చేయడం ప్రారంభించింది. అదే సమయంలో దేశీయ విఫణిలో విక్రయించడానికి కూడా ఉత్పత్తి చేస్తోంది. కాగా ఇప్పుడు సౌదీ అరేబియా మార్కెట్లో విక్రయించిన నిస్సాన్ మాగ్నైట్ కోసం బ్రాండ్ రీకాల్ జారీ చేసింది. బ్రేక్ పైపు, హీట్ షీల్డ్ మధ్య తగినంత ఖాళీ లేకపోవడం వల్ల కలిగే భద్రతా సమస్యను నిస్సాన్ గుర్తించింది. ఇది బ్రేక్ పెడల్ పనితీరును దెబ్బతీస్తుందని.. ప్రమాదానికి కారణమవుతుందని కంపెనీ వెల్లడించింది. బ్రేక్ ఫ్లూయిడ్ లీకేజీకి కూడా దారితీస్తుందని కూడా సంస్థ పేర్కొంది. ఇప్పుడు ఈ సమస్యను పరిష్కరించడానికి నిస్సాన్ రీకాల్ జారీచేసింది. ఈ రీకాల్ నిర్ణయం సౌదీ అరేబియాలోని మొత్తం 1,552 యూనిట్ల మాగ్నైట్ ను ప్రభావితం చేయబోతోంది. అయితే నిస్సాన్ మోటార్ ఇండియా భారతదేశానికి సంబంధించిన మోడళ్లకు ఎటువంటి రీకాల్ జారీ చేయలేదు. భారతదేశం, సౌదీ అరేబియాలో విక్రయించే నిస్సాన్ మాగ్నైట్ మోడల్‌లు ఒకే విధమైన స్పెసిఫికేషన్‌లను పంచుకుంటాయి. తేడా ఏమిటంటే ఇండియాలో రైట్ హ్యాండ్ డ్రైవ్ కాన్ఫిగరేషన్ అయితే.. సౌదీ అరేబియాలో లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్. ఈ కారణంగానే బ్రేక్ ఫ్లూయిడ్ పైపుల రూటింగ్ అనేది కొంత భిన్నంగా ఉంటుంది. ఇదే సమస్యకు దారితీసినట్లు స్పష్టమవుతోంది.

# ఈ స్కూటర్ల ఓనర్లకు గుడ్‌న్యూస్ చెప్పిన కంపెనీ



దేశంలోని ప్రముఖ ఎలక్ట్రిక్ టూ వీలర్ సంస్థ ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ తమ కస్టమర్లకు మంచి కబురు చెప్పింది. దేశవ్యాప్తంగా 500 ఎక్స్ పీరియన్స్ సెంటర్ (ఈసీ)లను అధిగమించింది. ఇది దాని రిటైల్ విస్తరణలో ఒక ప్రధాన మైలురాయిని సూచిస్తుంది. గత మూడు నెలల్లో (జూన్-ఆగస్టు 2025), ఏథర్ 101 కొత్త ఈసీలను జోడించింది. "మా వృద్ధి భారతదేశం అంతటా ఎలక్ట్రిక్ మొబిలిటీకి పెరుగుతున్న డిమాండ్‌ను ప్రతిబింబిస్తుంది" అని ఏథర్ ఎనర్జీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రవ్నీత్ సింగ్ ఫోకెలా అన్నారు. "దక్షిణ భారతదేశం మా కంచుకోటగా నిలిచినప్పటికీ, రిజ్తా విజయం టైర్-2, 3 నగరాల్లో మా విస్తరణను వేగవంతం చేసింది" అన్నారు. ఆగ్రా, జబల్పూర్, బిలాస్పూర్, వడోదర, సుందర్గఢ్ వంటి నగరాల్లో ఏథర్ ఇప్పుడు ఈసీలను కలిగి ఉంది. అలాగే కాలికట్, గుంటూరు, హల్ద్వానీ, కోటా వంటి పట్టణాల్లోకి చొచ్చుకుపోయింది. మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఒక్కో చోట 50కి పైగా ఈసీలు ఉన్నాయి. బెంగళూరులో ఏకంగా 18 కేంద్రాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఏథర్ మార్కెట్ వాటా 2026 తొలి త్రైమాసికంలో 14.3 శాతానికి పెరిగింది. గత సంవత్సరం ఇది 7.6% ఉండగా రెట్టింపు అయింది. మధ్య భారతదేశంలో వాటా 10.7 శాతానికి పెరగగా, దక్షిణ భారతదేశంలో 22.8 శాతంతో ఆధిపత్యాన్ని చాటింది.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





## యంగ్ లుక్ తో అదరగొడుతున్న

### ఫొటోలు ఇవిగో! బెస్ట్ డిజైన్ రూపొందిస్తే బహుమతి

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న కొత్త చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' నుంచి చిత్ర బృందం సరికొత్త హెచ్‌డీ స్టిల్స్‌ను విడుదల చేసింది. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. తాజాగా రిలీజ్ చేసిన ఫొటోల్లో మెగాస్టార్ చిరంజీవి తనదైన స్టైల్, ఎనర్జీతో ఆకట్టుకుంటున్నారు. ఈ స్టిల్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా అభిమానులను ఉత్తేజపరుస్తూ ఓ ప్రత్యేక పోటీని కూడా ప్రారంభించారు. విడుదల చేసిన కొత్త స్టిల్స్‌తో క్రియేటివ్ డిజైన్లు రూపొందించాలని, వాటిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రత్యేక '%మీ+%' మర్చండైజ్ బహుమతిగా అందిస్తామని తెలిపారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ భారీ మల్టీస్టారర్ చిత్రంలో చిరంజీవికి జోడీగా నయనతార, కేథరిన్ త్రెసా నటిస్తున్నారు. ఇందులో విక్టరీ వెంకటేశ్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇద్దరు స్టార్ హీరోల కలయికలో వస్తున్న ఈ సినిమా సంక్రాంతికి ప్రేక్షకులకు మంచి వినోదాన్ని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.



## బాలీవుడ్ బ్యూటీ శిల్పా శెట్టిని వెంటాడుతున్న కష్టాలు..

### ముంబయి రెస్టారెంట్‌లో ఐటీ సోదాలు..!

బాలీవుడ్ నటి శిల్పాశెట్టికి కష్టాలు కొనసాగుతున్నాయి. నటికి చెందిన ప్రముఖ రెస్టారెంట్ బాస్టియన్‌పై బెంగళూరులో కేసు నమోదైన విషయం తెలిసిందే. అనుమతించిన సమయం కంటే ఎక్కువసేపు కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు, అర్ధరాత్రి పార్టీలకు అనుమతించి నిబంధనలు ఉల్లంఘించినందుకు కేసు నమోదైంది. తాజాగా ముంబయిలోని శిల్పా శెట్టి రెస్టారెంట్‌పై ఆదాయపు పన్నుశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. పన్ను ఎగవేత ఆరోపణలపై పలు కంపెనీలపై ఆదాయపు పన్నుశాఖ దాడులు చేసిందని అధికార వర్గాలు తెలిపాయి. ఇందులో శిల్పా శెట్టి హోటల్ సైతం ఉందని పేర్కొన్నారు. బుధవారం నుంచి ముంబయి, పరిసర ప్రాంతాల్లోని సుమారు 20 నుంచి 24 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సోదాలలో శిల్పా శెట్టికి చెందిన ఒక రెస్టారెంట్, మరికొన్ని కార్యాలయాలు ఉన్నాయని వర్గాలు తెలిపాయి. బాస్టియన్ రెస్టారెంట్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, పన్ను అవకతవకలపై అధికారులు పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇన్ కం ట్యాక్స్ అధికారులు ముంబయిలోని ఇంటిపై దాడులు చేశారన్న వార్తను శిల్పా శెట్టి ఖండించింది. మహారాష్ట్ర పోలీసులు శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రాపై మోసం ఆరోపణలపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌తో గానీ, నిబంధనలకు విరుద్ధంగా రెస్టారెంట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై బెంగళూరులో నమోదైన కేసుతో గానీ, ఐటీ సోదాలకు ఎలాంటి సంబంధం లేదని అధికారులు పేర్కొన్నారు. బెంగళూరులోని బాస్టియన్ రెస్టారెంట్‌కు శిల్పాశెట్టి కో ఓనర్‌గా ఉన్నట్లు సమాచారం. రెస్టారెంట్‌లో బాలీవుడ్ నటికి యాజమాన్య హక్కులు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. శిల్పా శెట్టి, ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్ కుంద్రా రూ.60కోట్ల మోసం చేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఇటీవల సోషల్ మీడియా వేదికగా శిల్పా క్లారిటీ ఇచ్చారు. ఈ కేసులో తాను విచారణకు సహకరించినట్లుగా తెలిపారు.

## పేరు ముందు ట్యాగ్ వద్దనుకున్నా!

అంతర్జాతీయ ప్రమాణాలతో 'డెకాయిట్' చిత్రాన్ని తీశామన్నారు హీరో అడివి శేష్. షానియల్ డియో దర్శకత్వంలో తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ లవ్, యాక్షన్ డ్రామా టీజర్‌ను గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ప్రేమ, దోపిడీ ప్రధానాంశాలుగా సాగే ఈ కథలో అడివి శేష్ మాస్ అండ్ రగ్గ్‌డ్ పాత్రలో కనిపించారు. ఆయన క్యారెక్టర్ మల్టీషేడ్స్‌తో ఆకట్టుకుంది. యాక్షన్ సన్నివేశాలు రోమాంచితంగా సాగాయి. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మించిన ఈ సినిమాకు సునీల్ నారంగ్ సహనిర్మాత.




ఈ సందర్భంగా అడివి శేష్ మాట్లాడుతూ 'దర్శకుడు షానియల్ డియో నా బెస్ట్ ఫ్రెండ్. ఇద్దరం యూఎస్‌లో కలిసి పెరిగాం. ఒకరి సంస్కృతిని ఒకరం అర్థం చేసుకొని మంచి హైబ్రిడ్ సినిమా చేశాం. తను సాంకేతికంగా హాలీవుడ్ స్టైల్లో తీశాడు. నాగార్జున 'హలో బ్రదర్' సినిమాలోని 'కన్నెపెట్టరో కన్ను కొట్టరో..' పాటను బీజీఎం కోసం ఉపయోగించాం' అన్నారు. ఇప్పటికీ చాలా సినిమాల్లో నటించినా పేరు ముందు ట్యాగ్ ఎందుకు పెట్టుకోలేదని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు అడివి శేష్ బదులిస్తూ 'చిన్నప్పుడే అమ్మానాన్న నాకు 'అడివి శేష్' అనే ట్యాగ్ ఇచ్చారు. అందుకే మరో ట్యాగ్ వద్దనుకున్నా. ఏదో ఒక ట్యాగ్ పెట్టుకోవడం నాకు నచ్చదు. మంచి సినిమాలతో నటుడిగా గుర్తుండిపోవాలన్నదే నా అభిమతం' అని చెప్పారు.

## హారర్ థ్రిల్లర్‌లో రామ్?

ఇటీవల 'ఆంధ్రకింగ్ తాలూకా' చిత్రంలో ప్రేక్షకుల ముందుకొచ్చారు హీరో రామ్. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని సాధించలేకపోయింది. గత కొంతకాలంగా కెరీర్‌లో హిట్ కోసం ఎదురుచూస్తున్నారు రామ్. ఈ నేపథ్యంలో ఆయన తన పంథాను మార్చుకొని తొలిసారి ఓ హారర్ థ్రిల్లర్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. కిషోర్ గోపు దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని ఆర్కా మీడియా సంస్థ నిర్మించనుందని సమాచారం. ఈ సినిమా కథా రూపకల్పనలో రామ్ కూడా భాగమయ్యారని, రెగ్యులర్ ఫార్మాట్‌కు భిన్నమైన ఈ కథపై ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఫిల్మ్ నగర్ టాక్. జనవరిలో తొలివారంలో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడుతుందని, అదే నెలాఖరులో షూటింగ్ ప్రారంభమవుతుందని వార్తలొస్తున్నాయి.

